# గ్రేటర్ కాంగ్రెస్‌లో సందిగ్ధం

- మంత్రివర్గంలో తేలని గ్రేటర్ బెర్త్
- ముంచుకొస్తున్న లోక్‌సభ ఎన్నికలు
- అటు ఎమ్మెల్సీ... ఇటు ఎంపీ సీటు. తేల్చుకోలేక పాట్లు

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ కాంగ్రెస్ నేతలు తీవ్ర సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ గ్రేటర్ పరిధిలో ఒక్క స్థానాన్ని కూడా కైవసం చేసుకోకపోవడంతో మంత్రివర్గంలో గ్రేటర్ బెర్త్‌ను భర్తీ చేయడం పార్టీ అధిష్ఠానానికి ఒక సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో ప్రజాక్షేత్రంలో ఓడిపోయినా... కనీసం అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకొని ఎమ్మెల్సీ తద్వారా మంత్రివర్గంలో బెర్త్‌ను ఖాయం చేసుకోవాలని పలువురు నేతలు నిన్నటిదాకా అటు హస్తిన.. ఇటు గాంధీభవన్‌లో ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలు కూడా ముంచుకొస్తుండటంతో అటు ఎమ్మెల్సీ, ఇటు ఎంపీ.. దేని కోసం పైరవీ చేయాలో తేల్చుకోలేకపోతున్నారు.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఒక స్థానంలోనూ విజయం సాధించలేదు. దీంతో రాష్ట్ర మంత్రివర్గంలో అన్ని జిల్లాలకు సముచిత ప్రాధాన్యం కల్పించాల్సిన సమయంలో ఇదో చిక్కుముడిగా మారింది. ఇప్పటికే కొలువుదీరిన ప్రభుత్వంలో పలు ఉమ్మడి జిల్లాలకు ప్రాధాన్యం కల్పించారు. మంత్రివర్గంలో మిగిలిన ఆరు బెర్తుల్లో భాగంగా గ్రేటర్ హైదరాబాద్‌కు కూడా స్థానం కల్పించే అవకాశం ఉంది. ఈ క్రమంలో హస్తం పార్టీ గుర్తుపై గెలిచిన వారు ఎవరూ లేకపోవడంతో ఈ స్థానాన్ని భర్తీ చేయడం ఎలా? అనే దానిపై కాంగ్రెస్ అధిష్ఠానం కాస్త తర్జనభర్జన పడుతూనే ఉంది. అయితే గ్రేటర్ పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసి ఓడిపోయిన పలువురు కీలక నేతలు ఎలాగైనా మంత్రివర్గంలో బెర్త్‌ను ఖరారు చేసుకునేందుకు తమ మార్గాల్లో తీవ్ర ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఎలాగూ ఎమ్మెల్సీ స్థానాలు కొన్ని ఖాళీగా ఉండటంతో పాటు ఇకముందు మరికొన్ని ఖాళీలు రానున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రివర్గంలో బెర్త్‌ను ఖరారు చేసుకుంటే ఎలాగూ ఎమ్మెల్సీ దక్కుతుంది. అందుకే మంత్రివర్గ విస్తరణలో తమ పేరును ఖరారు చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మరోవైపు అసెంబ్లీలో అవకాశం ఇచ్చినందున ఈసారి తమకు అవకాశం ఇవ్వాలని అసెంబ్లీలో అవకాశం రాని నేతలు పోటీ పడుతున్నారు. దీంతో మంత్రివర్గ విస్తరణ సమయంలోనే గ్రేటర్ పరిధిలో అదృష్టం ఎవరిని వరిస్తుందనేది తేలనుంది.

### ముంచుకొస్తున్న పార్లమెంటు...

మంత్రివర్గంలో గ్రేటర్ బెర్త్ ఖరారు ఒకవైపు ఆలస్యం అవుతుండగా... మరోవైపు లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తూనే ఉన్నాయి. మునుపటికంటే ఒకటి, ఒకటిన్నర నెలల ముందే షెడ్యూల్ వచ్చే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతుంది. గ్రేటర్ బెర్త్ కోసం ప్రయత్నాలు చేస్తున్న నేతలకు లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తుండటం ఇబ్బందికరంగా తయారైంది. పలువురు నాయకులు తొలుత గ్రేటర్ బెర్త్... అక్కడా నిరాశ ఎదురైతే ఎంపీ టికెట్ కోసం ప్రయత్నించాలని అనుకున్నారు. కానీ రెండూ ఒకే సమయంలో రావడంతో దేని కోసం ప్రయత్నం చేయాలనే దానిపై సందిగ్ధం నెలకొంది. గ్రేటర్ పరిధిలో హైదరాబాద్ పార్లమెంటు స్థానం ఎలాగూ మజ్లిస్ కంచుకోట కావడంతో అటువైపు ఎవరూ పెద్దగా దృష్టి సారించరు. మిగిలిన సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల టికెట్లను అడగాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఒకేసారి అటు మంత్రి పదవి, కాకపోతే ఎంపీ టికెట్ రెండింటిని ఎలా అడగాలో తెల్వక అయోమయంలో పడిపోయారు. ఇదే తరుణంలో 'అన్ని చోట్లా మీ పైరవీలేనా?' అని ప్రశ్నించేందుకు ఎలాగూ అసెంబ్లీ ఎన్నికల్లో అవకాశం రాని వారు కాచుకు కూర్చోవడంతో వారిని ఎలా ఎదుర్కోవాలనేది కూడా వీరికి ఒక సవాల్‌గా మారింది.

---

*జలగం వెంగళరావు పార్కులో*

## యోగా, మెడిటేషన్ సెంటర్ ప్రారంభం



యోగా, మెడిటేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మేయర్ విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్

సిటీబ్యూరో, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ)/ బంజారాహిల్స్ : జలగం వెంగళరావు పార్కులో హార్ట్ ఫుల్ నెస్ ఇనిస్టిట్యూట్ సంస్థ సీఎస్‌ఆర్ కింద ఏర్పాటు చేసిన యోగా, మెడిటేషన్ సెంటర్‌ను బుధవారం ఉదయం జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్‌తో కలిసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగా, మెడిటేషన్‌లో పాల్గొన్నారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. మనస్సు ప్రశాంతంగా, చురుగ్గా ఉండేందుకు ప్రతి రోజు యోగా, మెడిటేషన్ తప్పనిసరిగా ఆచరించాలన్నారు. హార్ట్‌ఫుల్ నెస్ ఇనిస్టిట్యూట్ సంస్థ జలగం వెంగళ్‌రావు పార్కును సీఎస్‌ఆర్ కింద అభివృద్ధి చేయడంతో పాటు బ్యూటిఫికేషన్ కోసం హెర్బల్, మెడిసిన్ గార్డెన్స్ , బయో డైవర్సిటీ మొక్కలు , పరాగసంపర్క ఉద్యానవనం, సుగంధ మొక్కలు పెంచడంలో జీహెచ్‌ఎంసీతో సమన్వయం చేసుకుంది. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వెంకటేశ్ దొత్రే, ఈఈ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కమిషనర్ ఎనాన్స్ సెంటర్ వద్ద గల పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ అబ్దుల్ వకిల్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## 29 నుంచి నెక్లెస్‌రోడ్‌లో అలీప్ వీకార్ట్ ఎగ్జిబిషన్




బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న శ్రీదేవి, జ్యోతి, పల్లవి, మహాలక్ష్మి తదితరులు

ఖైరతాబాద్, డిసెంబర్ 27 : అసోసియేషన్ ఆఫ్ లేడీ ఆంత్రప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో 'అలీప్ వీకార్ట్' పేరుతో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వైస్ చైర్‌పర్సన్ పి.జ్యోతిరావు, కార్యదర్శి వి.శ్రీదేవి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లను అసోసియేషన్ సహాయ కార్యదర్శి పల్లవి జోషి, కోశాధికారి మహాలక్ష్మి, సభ్యులు అన్నపూర్ణ, పద్మావతి, శైలజతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వ సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల శాఖ సహకారంతో నిర్వహిస్తున్న ఈ ఎగ్జిబిషన్‌లో 75 శాతం మహిళా ఆంత్రప్రెన్యూర్స్‌కు సంబంధించిన ఆహార ఉత్పత్తులు, తదితర వస్తువులు ఉంటాయని తెలిపారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ హరిచందన, ఎంఎస్‌ఎంఈ అదనపు డెవలప్‌మెంట్ కమిషనర్ డి.చంద్రశేఖర్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఈ.విష్ణువర్ధన్, ఎస్ఐడీబీఐ జనరల్ మేనేజర్ హిమాన్షు ఆస్తానా, నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతల, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ దేబాశీష్ చిత్ర, యూబీఐ జనరల్ మేనేజర్ ఎన్. కృష్ణనన్ హాజరవుతున్నారని తెలిపారు.

## జేఎన్‌టీయూలో డాటా సెంటర్ ఏర్పాటు



కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 27: జేఎన్‌టీయూలో అతి పెద్ద డాటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ఆదానికనెక్స్ డాటా సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు ముందుకొచ్చారు. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ గోవర్ధన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్‌హుస్సేన్‌తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదానికనెక్స్ కంపెనీ ప్రతినిధులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల నూతన భవనంలో రూ.5 కోట్ల ఖర్చుతో యూనివర్సిటీలో బిగ్ డాటా సెంటర్‌ను ప్రారంభించడానికి ఆ కంపెనీ ప్రతినిధులు ముందుకొచ్చారు. డాటా సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల పెద్ద కంపెనీలకు చెందిన డాటా భద్రపర్చుకోవచ్చని వీసీ పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలోని పలు ఇంజినీరింగ్ కాలేజీలు, వారి విద్యార్థుల డాటా వంటి వివరాలు కూడా ఇక్కడ భద్ర పరుచుకోవడానికి అవకాశం ఉందన్నారు. స్టూడెంట్ పాజెక్టు వర్క్‌తో పాటు పరిశోధనలు వంటి అనేక బహుళ ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు.

## వారు కన్నుమూసి.. మరి కొందరికి జీవితాన్నిచ్చి

ఖైరతాబాద్, డిసెంబర్ 27 : ఆమె మరణిస్తూ ఆరుగురికి జీవనదానం చేసింది. జగిత్యాల జిల్లా కోరుట్లలోని ముత్యాలవాడకు చెందిన చాడ సంధ్యారాణి గృహిణి. ఆమెకు భర్త చాడ శ్రీనివాస్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ నెల 24న భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. చికిత్స కోసం ఆమెను సోమాజిగూడలోని యశోద దవాఖానకు తరలించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు బుధవారం బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టను వివరించగా.. అందుకు అంగీకరించారు. ఆమె శరీరం నుంచి కాలేయం, రెండు మూత్ర పిండాలు, కండ్లు, ఒక ఊపిరితిత్తిని సేకరించారు.

### ముగ్గురికి అవయవదానం

మెదక్ జిల్లా కల్వకుంట్ల మండలం రామాయంపేటకు చెందిన బల్లూరి వెంకటేశం (55) కూలీగా పనిచేస్తున్నాడు. ఈ నెల 24న రోడ్డుపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన వెంకటేశంను సికింద్రాబాద్‌లోని యశోద దవాఖానలో చేర్పించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు ఈ నెల 26న బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. జీవన్‌దాన్ సూచనల మేరకు కాలేయం, రెండు మూత్రపిండాలను కుటుంబ సభ్యులు దానం చేశారు.



బల్లూరి వెంకటేశం(ఫైల్),



సంధ్యారాణి (ఫైల్)

## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నాం

- అణు ఇంధన కేంద్రీయ విద్యాలయం గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు
- హాజరైన ప్రముఖులు



ప్రముఖులతో కలిసి అణు ఇంధన కేంద్రీయ విద్యాలయ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

చర్లపల్లి, డిసెంబర్ 27 : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులకు సౌకర్యాలు కల్పిస్తున్నామని ఎన్ఎఫ్‌సీ చీఫ్ ఎగ్జిక్యూటివ్, చైర్మన్ డాక్టర్ కమల్‌కపూర్, ఈసీఐఎల్ సీఎండీ అనురాగ్‌కుమార్ పేర్కొన్నారు. ఏఎస్‌రావు నగర్ డివిజన్ డీఏఈ కాలనీలోని అణు ఇంధన కేంద్రీయ విద్యాలయం గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ రాహుల్ సింగ్ గౌతమ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా ఉన్న అణు ఇంధన కేంద్రీయ విద్యాలయం స్కూల్స్‌లో డీఏఈ ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించడంతో పాటు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... ఈ విద్యాలయంలో తాను కూడా చదువుకున్నానని, స్కూల్ అభివృద్ధికి తన వంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, సినీ నటుడు లోబో చేసిన సందడి అందరిని ఆకర్షించాయి. అలాగే పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు రోమాసింగ్, నాయుడు, ప్రవీణ్ అలగానీ, ఉమాకాంత్, రాబిన్‌సన్, పద్మసింగ్, అనిల్‌కుమార్, డానియల్, కస్తూరిలతో పాటు వివిధ దేశాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు 1500 మంది పాల్గొన్నారు.

## పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 27: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫిల్ క్లినికల్ సైకాలజీ, ఎంఫిల్ ప్రొఫెషనల్ డిప్లొమా ఇన్ క్లినికల్ సైకాలజీ కోర్సులతో పాటు దూర విద్య ద్వారా అందించే ఎమ్మెస్సీ మేథమేటిక్స్, ఎంసీఏ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు.

### బీఎఫ్‌టీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (బీఎఫ్‌టీ) పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. బీఎఫ్‌టీ (సీబీసీఎస్) మొదటి సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును జనవరి 24 లోపు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు.

### బీఏ పరీక్షా తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని బీఏ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు అధికారులు తెలిపారు. బీఏ (సీబీసీఎస్) మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను నేటి నుంచి నిర్వహించనున్నారు.



## 'సాలార్‌జంగ్‌లో' హుక్కా గ్యాలరీ..

ప్రపంచం నలుమూలల నుంచి సేకరించిన విభిన్నమైన హుక్కా పీపాలను సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రదర్శనలో భాగంగా సందర్శకులు తిలకించేందుకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇంగ్లాండ్ దేశంతోపాటు చైనా, మయన్మార్, మన దేశంలో వాడుకలో ఉన్న విలువైన హుక్కాలను సేకరించిన వాటిని అధికారులు ప్రదర్శనలో ఉంచారు. మ్యూజియంలో ఏర్పాటు చేసిన హుక్కా గ్యాలరీని సందర్శించిన పర్యాటకులు ఔరా హుక్కాలో ఇన్ని వెరైటీలు ఉన్నాయా? అంటూ ఆశ్చర్యపోతున్నారు. – చార్మినార్, డిసెంబర్ 27